ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 24 సంచిక : 06 ఫిబ్రవరి 2019

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 20

గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రూ॥ 150/-
విడి ప్రతి : రూ॥ 12/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ఈ సంచికలో....

18-12-1986
శృంగవృక్షం

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

# సద్గురు శ్రీ నాన్నగారి విగ్రహ ప్రతిష్ఠ

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

మార్చి 11, 12వ తేదీలు

**పూజాకార్యక్రమములు**

మార్చి 13వ తేదీన ఉదయం గం॥ 6-43 ని॥లకు

**సద్గురు శ్రీ నాన్నగారి విగ్రహ ప్రతిష్ఠ**

జరుగును.

భక్తులందరకు తెలియజేయడమైనది.

భూపతిరాజు సూర్యనారాయణరాజు

శ్రీ రమణ క్షేత్రం

Visit us @ www.srinannagaru.com email : avatarabujji@gmail.com

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-12-1986, శృంగవృక్షం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈరోజు రమణజయంతి. రమణుడు 1879వ సంవత్సరం డిసెంబరు నెల 30వ తేదీ రాత్రి ఒంటిగంటకు తమిళనాడులోని తిరుచ్చుళి అనే గ్రామంలో జన్మించారు. ఆయన జీవితం పొడుగునా ఒకే వస్తువు గురించి ఆత్మ గురించి చెప్పారు, అందులో రాజీ లేదు. తిరుచ్చుళిలో ఉన్న దేవుడి పేరు భూమినాథేశ్వరుడు. ఆ రోజున స్వామి యొక్క ఉత్సవవిగ్రహాన్ని ఊరేగిస్తున్నారు. ఎప్పుడూ కూడా మూల విరాట్టు ఊరేగదు, ఉత్సవవిగ్రహమే ఊరేగుతుంది. మూలవిరాట్టు వేరు, ఉత్సవవిగ్రహం వేరు కాదు. మూలవిరాట్టు యొక్క ప్రతినిధే ఉత్సవ విగ్రహం. ఆయన వేరు, ఈయన వేరు కాదు. అదే విధంగా మనలోపల ఉన్న పరమాత్మ యొక్క ప్రతిబింబమే జీవుడు. అందుచేత జీవుడికి సేవ చేస్తే అంటే మీరు మానవుడికి సేవచేస్తే మాధవుడికి సేవ చేసినట్లే అని చెపుతారు. ఫ్యాక్టరీలోనుండి సిమ్మెంట్, పంచదార ఉత్పత్తి చేసినట్లు మానవత్వానికి సంబంధించిన విలువలను మనం యంత్రాల ద్వారా ఉత్పత్తి చేయలేము అని రస్సెల్ చెప్పాడు. ఇప్పడు సైన్స్ ఎంతో అభివృద్ధి అయ్యింది ఈ రోజులలో కూడా ఈ వేదాంతం మాటలు ఏమిటి అని కొంతమంది అనుకోవచ్చు. సోదర మహాశయులారా! ఒక చిన్న విషయం. మనం యాంత్రికంగా ఎంతో అభివృద్ధి చెందినమాట నిజం. మన మనస్సులో ఉన్న ఒక్క లోపాన్ని యంత్రం తీయగలదా? మీరు ప్రశాంతంగా ఆలోచించండి. మీరు చేతితో తొలగించుకోలేని బరువైన రాళ్ళు తలంపుల రూపంలో మీ హృదయంలో ఉన్నాయి. అవి మీకు దుఃఖాన్ని తీసుకొని వస్తున్నాయి. మీ హృదయంలో ఉన్న ఆ రాళ్ళను, ఆ బలహీనతలను మీరు యంత్రం పెట్టి బయటకు లాక్కోగలరా? అటువంటి యంత్రం ఏదైనా ఈ సృష్టిలో ఉందా? సైన్స్ ఎంతో అభివృద్ధి అయ్యింది కదా! మరి నాలో ఉన్న బలహీనతలను బయటకు లాగే యంత్రం ఎందుకు లేదు? మన లోపల ఉన్న బలహీనతల నుండి, తలంపుల నుండి బయటకు వచ్చి శాశ్వత జీవితాన్ని మనం అందుకోవాలి అంటే దానికి జ్ఞానం కావాలి.

అందరి హృదయాలలో నేను ఆత్మరూపంలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. నా హృదయంలో ఆత్మ ఉంది, కాని అది నాకు అనుభవంలో లేదు. ఈ జన్మలో కాకపోయినా మరో జన్మలో అయినా, ఈ లోకంలో కాకపోయినా మరొక లోకంలో అయినా నా

హృదయంలో ప్రకాశిస్తున్న ఆత్మను నేను దర్శించలేకపోతే, ఆత్మానుభవం పొందకపోతే నాకు మోక్షం లేదు, శాంతి లేదు. అయితే ఆత్మను తెలుసుకోవటానికి ఈ మనస్సు సిద్ధంగా లేదు. ఈ మనస్సును సిద్ధం చేయటానికే, మనస్సును ప్రిపేర్ చేయటానికే పూజలు, జపాలు, ధ్యానాలు, శ్రవణాలు, ఈ సాధనలు అన్నీ. మనస్సు పవిత్రం అవ్వాలి, మనస్సు శుద్ధి అవ్వాలి. మనస్సు పవిత్రం అయితే కాని అది అంతర్ముఖం అవ్వదు. నా హృదయంలో భగవంతుడు ఉన్నాడు అని చెపుతున్నారు కదా అయితే ఆయన నా అనుభవంలో ఎందుకు లేడు అని అడుగుతున్నారు. ఆయనను గుర్తించే జ్ఞానం, ఆ వస్తువును గ్రహించే జ్ఞానం, దానికి తగినటువంటి బుద్ధి మీకు లేదు, వస్తువు మన హృదయంలోనే ఉంది కాని దానిని తెలుసుకొనే బుద్ధి మనకు లేదు. మన హృదయంలో ప్రత్యక్షంగా ప్రకాశిస్తున్న ఆత్మను మన చేతికి అందేలా చేయటంకోసం, ఆవిధంగా మానవజాతిని తయారుచేయటంకోసం రమణుడు ఈ భూమి మీద అవతరించాడు. మన స్వరూపం గురించి మనకు అర్థమయ్యేలాగ చెప్పి మన స్వరూపాన్ని పొందింపచేయటం కోసం, మన మనస్సును లోపలకు పంపటంకోసం మన హృదయంలో ఉన్న ఆత్మే ఒక రూపం ధరించి వచ్చింది, ఆ రూపమే రమణుడు. భూమినాథస్వామి ఆ గ్రామంలో ఊరేగి దేవాలయంలో ప్రవేశించే టైములో రమణస్వామి తల్లి గర్భంలో నుండి బయటకు వచ్చాడు. ఆయన ఊరేగి లోపలకు వెళ్ళాడు, ఈయన తల్లి గర్భంలో నుండి బయటకు వచ్చాడు. ఆయన కర్మ జీవుడు కాదు, కారణ జన్ముడు. మనం చేసుకొన్న పుణ్యాన్ని బట్టి మనకు బహుమతిగా సర్వేశ్వరుడు రమణస్వామి లాంటి మహాత్ములను మనకు ప్రసాదించాడు.

ఈ రోజున మనం రమణస్వామి యొక్క పుట్టినరోజును చేసుకొంటున్నాము. భగవాన్ ఒక మాట చెప్పారు, పుట్టినరోజు అంటే ఈ శరీరం పుట్టినప్పుడు అది పుట్టినరోజు కాదు. ఈ శరీరం పుట్టింది, అది మరణిస్తుంది. ఈ శరీరం పుట్టినా, అది మరణించినా ఈ పుట్టుకకు, మరణానికి అతీతంగా ఒక వస్తువు నీ హృదయంలో ఉంది. దానికి పుట్టుక లేదు, మరణం లేదు, దానికి వికారం లేదు. అది అందరి హృదయాలలో ప్రకాశిస్తోంది. నీ హృదయంలో ప్రకాశిస్తున్న ఆ వస్తువును ఏరోజు అయితే నువ్వు తెలుసుకొంటావో, ఏరోజు అయితే ఆ వస్తువును అనుభవంలోనికి తెచ్చుకొంటావో ఆ రోజే నిజమైన పుట్టినరోజు అంతేగాని ఈ శరీరం పుట్టినరోజు నీ పుట్టినరోజు కాదు. ఇటువంటి దేహాలు ఎన్ని వచ్చినాయో, ఎన్ని రాలిపోయినాయో. అందులో ఏ శరీరం నీది, ఏ పుట్టిన రోజు అని చేసుకొంటావు.

రమణస్వామి తల్లితండ్రులకు మూడవ సంతానం వారిది సామాన్యమైన కుటుంబం, పెద్ద ధనవంతులు కాదు. ఈ మధ్యన ఒక స్నేహితుడితో నేను ఏమన్నాను అంటే నువ్వు పేదరికంలో పుట్టావు, చాలా అభివృద్ధిలోనికి వచ్చావు అన్నాను అతను ఏమన్నాడు అంటే పేదరికంలో పుట్టినందుకు నేను బాధపడటం లేదు. ధనవంతుల ఇంట్లో పుట్టిఉంటే ధనవంతుల గుణాలు అన్నీ నాకు వచ్చి ఉండేవి కదా! నాలో ఏమైనా మంచి లక్షణాలు ఉన్నాయి అని మీరు అనుకొంటూఉంటే అవి నేను పేదకుటుంబంలో పుట్టటం వలన వచ్చాయి అనుకొంటున్నాను. పేదకుటుంబంలో పుట్టటం వలన ధనంవలన వచ్చే గర్వం కాని, ధనంవల్ల వచ్చే అహంకారం కాని ఆ వలలో నుండి బయట పడ్డాను అని చెప్పాడు. బడిలోను, కాలేజీలోను నేర్చుకొనే పాఠాలకంటే అతను పుట్టిన పేద కుటుంబమే అతనికి ఎక్కువ పాఠాలు నేర్పింది. అందుచేత నేను ధనవంతుల ఇంట్లో పుట్టలేదు అనే బాధ నాకు లేదు. నేను పేదవాడిలాగ మీకు కనిపిస్తున్నప్పటికీ ఆ పేదరికం నాకు ఎంతో మంచిని నేర్పింది అని చెప్పాడు. నువ్వు చాలా బాధలు కూడా పడ్డావు అన్నాను. నేను మంచి వాడిని అని మీరు అంటున్నారు. కొంతమంది చెడ్డవాళ్ళు నన్ను బాధపెట్టారు. చెడ్డ అనేది ఉంది కాబట్టే నాలో ఉన్న మంచి యొక్క విలువ మీకు తెలుస్తోంది కాని చెడ్డ లేకపోతే నా మంచి మీకు ఎలా తెలుస్తుంది అన్నాడు. మంచి యొక్క గొప్పతనం చూపించటం కోసం చెడు ఒక రకంగా సహకరిస్తుంది. ఏమిటయ్యా నువ్వు చెప్పే మాటలకు ఉపనిషత్‌లో మాటలు కూడా చాలటం లేదు, సరస్వతే నీ మొఖంలో నుండి బయటకు వస్తోంది అన్నాను.

రమణస్వామి ముత్తాతలలో ఒకతను సన్యాసి అయ్యాడు, తాతగార్లలో ఒకతను సన్యాసి అయ్యాడు, తండ్రి అన్నదమ్ములలో ఒకతను సన్యాసి అయ్యాడు. మూడు తరాలనుండి ఒక్కొక్కడు సన్యాసి అవుతున్నాడు. రమణస్వామి కుటుంబం మీద ఉన్న శాపం అది. ఆ కుటుంబంలో ఇప్పుడు రమణుడు జన్మించాడు. ఆ శాపం ఈయనకు వరం అయ్యింది. చిన్నప్పటి నుండి రమణస్వామికి భావగోప్యం ఉండేది. ఏదైనా ఒక తలంపు వచ్చినా, ఏవైనా భావాలు వచ్చినా వాటిని ఎక్స్‌ప్రెస్ చేసేవారు కాదు, వాటిని హృదయంలో గోప్యంగా అట్టేపెట్టుకొనేవారు. మనం చెప్పినమాటను ఎదుటి మనిషి అర్థం చేసుకొంటాడు, మనతో వాటా పంచుకొంటాడు అనుకొన్నప్పుడే ఎక్స్‌ప్రెస్ చేసేవారు కాని లేకపోతే అలా మౌనంగా ఉండేవారు. అందుచేత ఆయన మనస్సులో ఏముందో తల్లితండ్రులకు గాని, అన్నదమ్ములకు గాని తెలిసేది కాదు. రమణస్వామి కుటుంబానికి ఇష్టదైవం వేంకటేశ్వరస్వామి అందుచేత ఈయనకు వెంకటరామన్

అని పేరు పెట్టారు. రమణస్వామి తండ్రి అడ్వకేట్. ఒకసారి రమణస్వామి ఇంట్లో ఉన్న ముఖ్యమైన కాగితాలను చిత్తు కాగితాలు అనుకొని సరదాకు చింపేసాడు. ఇవన్నీ దస్తావేజులు వీటిని ఎవరు చింపేసారు అనితండ్రి అడిగాడు. అవి ముఖ్యమైన కాగితాలు అని తెలియక రమణస్వామి చింపేసాడు అని తల్లి చెప్పింది. తండ్రికి విపరీతమైన కోపం వచ్చింది. ఆయన భార్యతో ఏమన్నాడు అంటే వీడికి అన్నం పెట్టకు, తల గొరిగించి గోచీ పెట్టి ఇంట్లో నుంచి బయటకు గెంటెయ్యి అన్నాడు. పోనీ రెండు దెబ్బలు కొట్టవచ్చు కదా అలా చేయలేదు ఈ మాటలు అంటున్నాడు. సుందరమయ్యర్ ఎవడండీ ఆ మాటలు అనటానికి, ఆయనా జీవుడే. భవిష్యత్‌లో రమణస్వామికి జరిగేది అదే. అందుచేత ఆయన లోపలఉన్న పరమేశ్వరుడే ఆ మాటలు అనిపిస్తున్నాడు. తరువాత భగవాన్ అన్నారు తండ్రిగారు పెట్టిన శాపమే నాకు జీవితం పొడుగునా ఇలా గోచీ అయిపోయింది అని చెప్పారు.

రమణస్వామి చిన్నతనంలోనే ఆయన తండ్రి మరణించారు. తరువాత రమణస్వామి పినతండ్రి ఇంటి వద్ద మధురైలో చదువుకొన్నారు. ఆయన స్కూల్లో చదువుతూ ఉండగా 16వ సంవత్సరంలో ఒకరోజు ఆయన ఇంటి దగ్గర మేడ మీద పడుకొని ఉండగా మరణం వచ్చి ఆయన మీద పడింది. నేను చనిపోతున్నాను ఏమిటి? కాళ్ళు చేతులు కట్టెలు లాగ అయిపోయాయి, శ్వాస ఆగిపోయింది, శరీరం శవం అయిపోయింది, ఈ శరీరాన్ని స్మశానానికి తీసుకొనిపోయి కాలుస్తారు, ఈ శరీరంతోపాటు నేను కూడా పోవాలి కదా! మరి ఈ శరీరానికి సంబంధం లేకుండా నేను ఒకటి ఉందే, ఈ శరీరానికి దానికి అణుమాత్రం కూడా సంబంధం లేదు అని తెలుస్తోంది, ఇదా మృత్యువు అంటే అని మృత్యువు అంటే భయపడలేదు సరికదా దేహభావనలోనుండి, మృత్యువులోనుండి పూర్తిగా విడిపోయి తన స్వరూపమైన పరబ్రహ్మాన్ని తెలుసుకొన్నారు. అంటే మరణానుభవం ద్వారా మరణాన్ని జయించి అమృతత్వాన్ని పొందారు. పరబ్రహ్మాన్ని పొందాలని ఆయనకు కోరిక లేదు, దాని గురించి ఏమీ సాధన చేయలేదు. బ్రహ్మపదార్థం అనేది ఒకటి ఉందని తెలియకుండా, దాని గురించి శ్రవణం చేయకుండా, చదవకుండా బ్రహ్మస్వరూపాన్ని పొందినవాడు ఈ ఆధ్యాత్మిక జగత్తులో ఆయన ఒక్కడు మాత్రమే. ఈ అనుభవం పొందాక కూడా ఆయన మెకానికల్‌గా బడికి వెళుతున్నాడు. ఒకరోజు ఆయన బడికి వెళుతూ ఉంటే ఆయన సమీప బంధువు ఒకరు ఎదురు వచ్చాడు. మీరు ఎక్కడినుండి వస్తున్నారు అంటే నేను అరుణాచలం నుండి వస్తున్నాను అని చెప్పాడు. అరుణాచలమా, అరుణాచలమా అని ఆశ్చర్యంగా ఆ

బంధువును అడిగాడు. ఆ ఊరు పేరు అరుణాచలం, అక్కడి కొండ పేరు అరుణాచలం, అక్కడి దేవుడి పేరు అరుణాచలం, అంతా అరుణాచలమే అని చెప్పాడు. అది ఊరు అని నాకు తెలియదే, అరుణాచలం అంటే ఊరని అనుకోలేదు, కొండ అని అనుకోలేదు, అరుణాచలం అంటే నా హృదయంలో ఉన్న దేవుడే అరుణాచలం అనుకొన్నాను అన్నాడు.

మనం ఆత్మను తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నాము. ఆయన ప్రయత్నం చేయకపోయినా ఆత్మ వచ్చి ఆయనను వరించింది. సోదరమహాశయులారా! మనకు అర్హత కనుక ఉంటే, యోగ్యత కనుక ఉంటే పరమేశ్వరుడే వచ్చి మనలను ఆత్మ సింహాసనం మీద కూర్చోబెడతాడు. మనకు యోగ్యత లేకపోతే, అర్హత కనుక లేకపోతే మనకి కోరిక ఉన్నప్పటికీ ఆత్మ మనల్ని వరించదు. ఆత్మానుభవం పొందాక బడిలో పాఠాలు చదువుకోవటానికి పుస్తకం తెరచి చూస్తున్నప్పటికీ సమాధిస్థితి వరించి వరించి ఆయన మీద వచ్చి పడుతోంది. ఆయనకు చదువుకోవాలని ఉంది కాని సమాధిస్థితి, జ్ఞాన తేజస్సు ఆయనను హృదయంలోనికి గుంజుతోంది. పరమేశ్వరుడు ఏ కారణం నిమిత్తం ఆ శరీరాన్ని భూమి మీదకు తీసుకొని వచ్చాడో ఆ పని అయ్యితీరాలి. హృదయంలో ఉన్న భగవంతుడు ఆయనకు అనుభవంలోనికి వచ్చాడు కాబట్టి ఆయన దేహం దేవాలయం. ఆయన దేహం ఒక్కటే దేవాలయం కాదు మీకు భగవదనుభవం కలిగితే మీ దేహం కూడా దేవాలయం అవుతుంది. మనకు భగవంతుడిని తెలుసుకోవాలని ఉంది కాని అహంకారం అనే దెయ్యం మనకు అడ్డు వస్తోంది. దెయ్యం అడ్డు వస్తూ ఉంటే మనం దేవుడిని తెలుసుకోలేము. ఆ దెయ్యం తప్పకొంటేనే కాని దేవుడు మనకు తెలియబడడు. దెయ్యం మనకు దారి ఇస్తేనే కాని భగవంతుడిని మనం తెలుసుకోలేము. ఆ దెయ్యం ఎవరు అంటే మనలో ఉన్న అహంకారమే దెయ్యం. అందుచేత మనం ముందుగా ఆ దెయ్యాన్ని ప్రార్థించి దానిని తప్పకోమని బ్రతిమాలాలి. ఆ దెయ్యం ప్రక్కకు తప్పకొంటేనే దేవుడు మనకు కనిపిస్తాడు కాని ఆ దెయ్యం ప్రక్కకు తప్పకోకపోతే మీరు ఎన్ని జన్మలు ఎత్తినా, ఎంతమంది గురువులను ఆశ్రయించినా, ఎంతమంది దేవతలను ప్రార్థించినా మీకు దేవుడు తెలియబడడు, తెలియబడడు.

ఆత్మ ఆయనను వరిస్తోంది. లోకాతీతమైన, దేహాతీతమైన, ఇంద్రియాలకు అతీతమైన, శాస్త్రం కూడా వర్ణించలేనటువంటి శాంతిని రమణస్వామి అనుభవిస్తున్నాడు. అది మాటలతో వర్ణించలేము. ఆయనకు కళ్ళు మూతలు పడుతున్నాయి. అప్పుడు అన్నగారు అంటున్నారు

నువ్వు యోగిలా కనిపిస్తున్నావు, నీ బోటివాడికి ఈ చదువులు ఎందుకు? ఇంటికాడ నీకు పని ఏముంది? ఏ అరణ్యాలకో వెళ్ళరాదా అన్నాడు. చదువుకోవటం లేదని కోపంతో అలా అన్నాడు. ఈశ్వరుడు ఎలా పలికిస్తున్నాడో చూడండి. నిజమే నాబోటి వాడికి ఇంటితోటి పని ఏముంది అనే తలంపు వచ్చింది? అయితే ఎక్కడికి వెళ్ళాలి అనే ప్రశ్న ఎప్పుడైతే వచ్చిందో దానికి సమాధానంగా హృదయం యొక్క లోతులలో నుండి ఒక్కసారిగా పెల్లుబికి అరుణాచలం, అరుణాచలం అని లోపల నుండి సమాధానం వచ్చింది. అరుణాచలం వెళ్ళాలి సరే డబ్బులు ఎక్కడ నుండి వస్తాయి. ఇదేమిటి అని మనం అనుకొంటాము కాని ఈశ్వరుడి యొక్క ప్రేరణ చూడండి. ఉన్నది ఒక్కటే వస్తువు. అదే అందరిచేత పలికిస్తూ ఉంటుంది. మీరు నన్ను ఏదైనా కష్టమైన మాట అన్నారు అనుకోండి. అది అనిపించేవాడు ఈశ్వరుడే. మీ లోపల ఉన్న ఆయనకు తెలియకుండా ఆ మాట వస్తోందా? ఆయన సర్వసాక్షి, సర్వజ్ఞుడు. ఆయనకు తెలియకుండా మీకు తలంపు వస్తోందా? మీలో ఉన్న ఒక వాసనను గెంటేయటానికే ఈశ్వరుడు ఆ మాటలు అనిపిస్తున్నాడు. అది మీకు తెలియక ఎదుటివ్యక్తి మీద మీకు కోపం వస్తోంది. ఇది మీకు అర్థమవ్వాలి. ఇదే అసలు సైన్సు. ఇది అర్థం చేసుకోవటం చాలా కష్టం. అన్నగారు ఎవడు ఆ మాట అనటానికి? ఈశ్వరుడే ఆయనచేత అనిపిస్తున్నాడు. అరుణాచలం ప్రయాణం అయ్యాడు. కాలేజీకి వెళుతున్నాను అని అబద్ధం చెప్పాడు. అన్నగారు ఏమన్నాడు అంటే నేను కాలేజీ ఫీజు కట్టలేదు, ఫలానాచోట అయిదు రూపాయలు ఉన్నాయి తీసుకొని వెళ్ళి ఫీజు కట్టు అని చెప్పాడు. అంటే ఈశ్వరుడు ఈయన ప్రయాణానికి డబ్బు సిద్ధం చేస్తున్నాడు. అప్పుడు రమణస్వామి మూడు రూపాయలు తీసుకున్నాడు, రెండు రూపాయలు అక్కడే వదిలేసాడు. ఒక ఉత్తరం వ్రాసాడు. ఇది ఒక మంచి కార్యం చేయటానికి వెళుతోంది, దీనికోసం వెదకి డబ్బులు ఖర్చు పెట్టకండి. ఇట్లు అని వ్రాసి కింద సంతకం పెట్టలేదు అంటే సంతకం పెట్టేవాడు అప్పటికే చనిపోయాడు. ఆయన అరుణాచలం వచ్చి తపస్సు చేసి ఆత్మను తెలుసుకొన్నాడు అని సర్వసాధారణంగా అనుకొంటారు కాని ఆయన ఇంటి దగ్గర ఉండగానే ఆత్మానుభవం పొందారు, మోక్షసామ్రాజ్యానికి అధిపతి అయ్యారు. అయితే మానవజాతికి సందేశం ఇవ్వటంకోసం ఈశ్వరుడే ఆ దేహాన్ని అరుణాచలం తీసుకొని వచ్చాడు. మీరందరు రమణ మహర్షి అంటున్నారు కాని నాకు పేరు ఎక్కడ ఉంది? శరీరానికి రూపం ఉంది, శరీరానికి పేరు ఉంది కాని ఆత్మకు రూపం ఏమిటి? ఆత్మకు పేరు ఏమిటి? అన్నారు. ఈశ్వరుడికి రూపం లేదు కాని ఒక పని నిమిత్తం ఆయన రూపం ధరించి వస్తాడు అంతే. భగవంతుడికి

రూపం లేదు, నామం లేదు. రూపం లేని దేవుడిని, నామం లేని దేవుడిని మనం అర్థం చేసుకోలేము కాబట్టి, మన బుద్ధికి అందదు కాబట్టి మన కోసం ఆయన ఒక రూపం ధరించి వస్తే ఆయనను పూజించటం లేదు, గౌరవించటం లేదు సరికదా ఆయనను అగౌరవపరచి, రాళ్ళు పుచ్చుకొని కొడుతున్నాము, అదీ మానవజాతి యొక్క చరిత్ర .

అరవింద ఘోష్ ఏమన్నారు అంటే ఈ మనుషులు అందరూ ఋషులు, యోగులు, అవతారపురుషులంతటి వారు అవ్వనక్కరలేదు కాని కనీసం ఒక ఋషిని, అవతార పురుషుడిని, యోగిని గౌరవించే శక్తిని కూడా కోల్పోయారు అని చెప్పారు. అంటే మనం ఎటువంటి స్థితిలో ఉన్నామో అర్థం చేసుకోండి. జ్ఞానం యొక్క విలువ నాకు తెలిస్తే జ్ఞానం సంపాదించాలని ఎంతోకొంత ప్రయత్నం చేస్తాను. జ్ఞానం యొక్క విలువే నాకు తెలియనప్పుడు జ్ఞానం కోసం నేను ఎలా ప్రయత్నం చేస్తాను? జ్ఞానం సంపాదించాలి అనే కాంక్ష, జ్ఞానం కోసం జీవించాలి, జ్ఞానం కోసం మరణించాలి అనేటువంటి వేదన మీ హృదయాంతరాళాల్లోంచి వస్తూ ఉంటే మీ మీద ఈశ్వరానుగ్రహం ఉంటేనే ఆకాంక్ష వస్తుంది కాని లేకపోతే రాదు, రాదు, రాదు. జ్ఞానం పొందాలి అనే కాంక్ష, ఆ తపన, ఆ కోరిక మీలో ఉందా? ఉంటే ఎంతవరకు ఉంది అని మీరు పరిశీలన చేసుకోండి. పుణ్యం చెయ్యండి, పాపం చేయకండి అని మన పెద్దలు చెపుతూ ఉంటారు. అయితే పుణ్యం ఎందుకు చెయ్యాలి? పుణ్యం వల్లే మోక్షం వచ్చేస్తుందా? పుణ్యం వల్లే జ్ఞానం వచ్చేస్తుందా? అలా కాదు. పుణ్యం చేస్తూ చేస్తూ అలా కొన్ని జన్మలు ప్రయాణం చేయగా చేయగా మీరు చేసే పుణ్యంవలన జ్ఞానం సంపాదించాలనే కోరిక పుడుతుంది అందుకని పుణ్యం చెయ్యమంటున్నారు. మనకు వచ్చే ప్రతీ తలంపును ఈశ్వరుడు చూస్తున్నాడు. ప్రతీ మాటను ఈశ్వరుడు వింటున్నాడు, ప్రతీ పనిని ఈశ్వరుడు చూస్తున్నాడు అనే భావన కనుక మన హృదయంలో స్థిరపడితే ఇంక చెడ్డ ఎవడు చేస్తాడు? ఇంక చెడు తలంపులు మన బుర్రలోకి రావు.

రమణస్వామి ఇంటి దగ్గర బయలుదేరి స్టేషన్‌కు వచ్చాడు. ఆయన ఒంటి గంటకు స్టేషన్‌కు వచ్చాడు. 12 గంటలకు రావలసిన ట్రైను ఆ రోజు ఒక గంట లేటుగా వచ్చింది. తిరువణ్ణామలైలో స్టేషన్ ఉన్నట్లు ఆయనకు తెలియదు. దిండివనానికి టికెట్ కొన్నాడు. ట్రైనులో కూర్చున్నాడు. ఆయన తప్పగా టికెట్ కొన్నట్లు లోపల ఉన్న ఈశ్వరుడు చూస్తున్నాడు కదా! రమణస్వామి కళ్ళు మూస్తున్నాడు, తెరుస్తున్నాడు. ఈశ్వరుడు మానవరూపం ధరించి

వచ్చి ప్రక్కన కూర్చున్నాడు. అబ్బాయి ఎక్కడికి వెళుతున్నావు అని అడిగాడు. నేను అరుణాచలం వెళుతున్నాను. టికెట్ ఎక్కడికి కొన్నావు? దిండివనానికి కొన్నాను. తిరువణ్ణామలైలో రైల్వేస్టేషన్ ఉందని నీకు తెలియదా? నాకు తెలియదు అని చెప్పాడు. విల్లుపురంలో దిగాలని తెలియదా? తెలియదు అని చెప్పాడు. ఒక గంట తరువాత చూస్తే ఆ మనిషి అక్కడ కనబడలేదు. అంటే రమణస్వామికి దారి చూపించి, గైడెన్స్ ఇచ్చి వెళ్ళిపోయాడు. మన హృదయంలో నిజాయితీ ఉంటే, మన సాధనలో నిజాయితీ ఉంటే అడుగు అడుగుకీ కూడా ఈశ్వరుడు మనకు గైడెన్స్ ఇస్తూ ఉంటాడు. ఎవడిలో అయితే కపటం లేదో వాడికి అడుగు అడుగున ఈశ్వరుడి సహాయం గోచరిస్తుంది. నేను మధురై నుండి తిరువణ్ణామలై ప్రయాణం అయినప్పడు గోదావరికి వరద వచ్చినప్పడు గడ్డిపరక ఎంత వేగంగా కొట్టుకొని పోతుందో అంత వేగంగా నా దేహం మధురై నుండి తిరువణ్ణామలై కొట్టుకొని వచ్చింది అన్నారు రమణస్వామి. తన గురించి తను ఆలోచించుకోవటం మానేసాడు రమణస్వామి. ఆలోచించేవాడు అప్పటికే పడిపోయాడు. అప్పడు ఈశ్వరుడు ఆ దేహాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. ఎందుకు అంటే భవిష్యత్‌లో ఆ దేహం ద్వారా ఈశ్వరవాణిని మానవజాతికి అందించటం కోసం ఆ దేహాన్ని భగవంతుడే స్వాధీనం చేసుకొన్నాడు. విల్లుపురంలో ట్రైను దిగాడు. అక్కడ నుండి కొంతదూరం కాలినడకన కొంతదూరం ట్రైనులోను ప్రయాణించి 1896 సం॥ సెప్టెంబరు 1వ తేదీన తిరువణ్ణామలై స్టేషన్‌కు వచ్చి అక్కడనుండి పరుగు పరుగున అరుణాచలేశ్వరుని ఆలయంలోకి వచ్చాడు. ఆలయం తలుపులు తెరిచి ఉన్నాయి, పూజారులు కూడా ఏదో పని మీద బయటకు వెళ్ళారు. అప్పా! నువ్వు రమ్మంటే నేను ఇక్కడికి వచ్చాను, నీ ఆజ్ఞననుసరించి ఇక్కడికి వచ్చాను అని తనను తాను నివేదించుకొన్నాడు రమణస్వామి. నాకు మోక్షాన్ని ప్రసాదించు, జ్ఞానాన్ని ప్రసాదించు అని ఏమీ అనలేదు. నువ్వు రమ్మంటే ఇక్కడకు వచ్చాను అని తనను తాను నివేదించుకొని బయటకు వచ్చాడు. మరల ఆయన జీవితంలో తిరిగి ఆలయంలోనికి వెళ్ళలేదు. రమణస్వామితో చిన్నప్పడు చదువుకొన్న స్నేహితుడు ఒకసారి ఆయనతో ఒరేయ్ వేంకట రామన్ నువ్వు నేను చాలా స్నేహంగా ఉండేవాళ్ళమే, కలిసి చదువుకొన్నాము కనీసం నువ్వు మధురై నుండి తిరువణ్ణామలై వచ్చేటప్పడు ఇంత స్నేహంగా ఉన్న నాకు ఒక్కమాట అయినా చెప్పలేదే అని అడిగాడు. మధురై నుండి తిరువణ్ణామలై వచ్చేటప్పడు నేను ఏమి ప్లాన్ చేసుకొని రాలేదు నేను ఇక్కడకు వస్తున్నానని నాకే తెలియదు. నాకే తెలియనప్పడు నేను

వెళుతున్నాను అని నీకు ఎలా చెప్పగలను? అన్నారు.

తరువాత రమణస్వామి అరుణాచలేశ్వర ఆలయంలో ఉన్న వేయిస్థంబాల మండపంలో మౌనంగా కూర్చున్నాడు. అక్కడ తపస్సు చేసాడు అని కొంతమంది చెపుతారు. ఆజన్మ దుర్విషయరహితునకు తపమేల, జపమేల అన్నాడు త్యాగరాజు. దేనిని సాధించిన తరువాత ఇంక పొందవలసింది అంటూ ఏమీలేదో, దేనిని పొందిన తరువాత దానికి మించినది కాని, దానితో సమానమైనదికాని ఈ లోకంలో కానీ, పరలోకంలోకానీ లేదని తెలుస్తుందో అదే ఆత్మ. అటువంటి ఆత్మవస్తువు ఆయనకు లభ్యమయ్యింది. అంటే పొందవలసింది ఏదో పొందాడు. ఇంక ప్రపంచంలో ఏ వస్తువు, ఏ సంఘటన ఆయనను చలింపచేయలేదు. జ్ఞాని అంటే చంటిపిల్లవాడి మనస్సు ఎలా ఉంటుందో జ్ఞాని మనస్సు అలా ఉంటుంది. చంటిపిల్లవాడు జరుగుతున్న సంఘటనను అది జరుగుతున్నంతసేపు ఆసక్తిగా చూస్తాడు. ఆ సంఘటన జరిగిపోయింది అనుకోండి తరువాత దాని ప్రభావం వాడి మీద ఏమీ ఉండదు. జ్ఞానికి కూడా అలాగే ఉంటుంది. జ్ఞానికి ఎప్పుడైనా కోపం వచ్చినట్లు మీకు కనిపించినా అది నీటిమీద గీత వంటిది. చంటిపిల్లవాడి హృదయం ఎలా ఉంటుందో జ్ఞాని హృదయం అలాగే ఉంటుంది. అయితే చంటిపిల్లవాడి హృదయంలో అహంకారం అణిగి ఉంటుంది కాని జ్ఞాని హృదయంలో అహంకారం కాలిపోయి ఉంటుంది, అక్కడ అహంకారం ఏమీ కనబడదు. అరుణాచల క్షేత్రానికి శేషాద్రిస్వామి చంద్రుడు, రమణస్వామి సూర్యుడు. ఆలయంలోని పాతాళ గుహలో రమణస్వామి కొంతకాలం శరీరధ్యాస లేకుండా ఉండిపోయారు. శరీరంలో కింద భాగం పురుగులు పట్టేసినాయి. పిల్లలు అక్కడ ఎక్కువగా అల్లరి చేసేవారు. పిల్లలు ఆయనను రాళ్ళతో కొడుతూ ఉంటే శేషాద్రిస్వామి ఆ పిల్లలను తరుముతూ ఉండేవాడు. అందుచేత ఉద్దండనాయనార్ అనే భక్తుడు రమణస్వామిని ఆలయంలో నుండి తీసుకొని వచ్చి గురుమూర్తంలో ప్రవేశపెట్టాడు. గురుమూర్తంలో ఉండగానే పళనిస్వామి వచ్చి సేవ చేయటం ప్రారంభించాడు. పళనిస్వామి విఘ్నేశ్వరుడికి భక్తుడు. ఆయన విఘ్నేశ్వర పూజ చేస్తూ ఉంటే ఎవరో అన్నారు ఏమయ్యా నువ్వు ఈ రాతికి పూజ చేస్తున్నావు, సాక్షాత్తు ఈశ్వరుడే రక్తమాంసములతో ఉన్న దేవుడే గురుమూర్తంలో ఉన్నాడు ఆయనకు సేవ చెయ్యి తరిస్తావు అని చెప్పారు. ఒక మహాత్ముడు మన వంక అలా చూస్తే చాలు మనలో ఉన్న వాసనలు అన్నీ బయటకు వచ్చి కాలి బూడిద అవుతాయి అంటే మహాత్ముడు యొక్క ఒక్క చూపు చాలు. ఆత్మకి ఇంత శక్తి ఉంది అని గ్రహించటానికి అయినా సత్పురుషుల సహవాసం ఉండాలి

లేకపోతే ఈ విషయాలు గ్రహించలేము.

మనందరం చేసేది ఏమిటి అంటే మనం చేసే ప్రయత్నం మానేస్తాము, నువ్వు మోక్షం ఎందుకు ఇవ్వటంలేదు అని భగవంతుడిని అడుగుతాము. ఆయన ఏమి చెయ్యాలో మీరు చెపితేనే గాని భగవంతుడికి తెలియదా? రాముడికి, కృష్ణుడికి జ్ఞానం ఉందా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. అప్పుడు రమణస్వామి ఏమన్నారు అంటే ఏ రాముడిని, ఏ కృష్ణుడిని స్మరిస్తూ ఉంటే మనకి జ్ఞానం కులుగుతోందో ఆయన జ్ఞానం లేకుండా ఉంటాడా అన్నారు. మనం చేయవలసిన పనిని వదిలేస్తున్నాము, ఈశ్వరుడు చేసే పని గురించి మనం డిమాండ్ చేస్తున్నాము. ఇదే గణపతిశాస్త్రితో భగవాన్ ఒకసారి అన్నారు. నీ భారం అంతా ఈశ్వరుడి మీద వెయ్యి. నీ భారం ఆయన మోస్తాడు. ప్రపంచం యొక్క బరువు అంతా మోసేవాడు నీ ఒక్కడి బరువు మోయలేడా? నీ గురించి ఏమి చెయ్యాలో, నీకు ఎప్పుడు జ్ఞానాన్ని ఇవ్వాలో నువ్వు ఆయనకు జ్ఞాపకం చెయ్యనక్కరలేదు, అది ఆయనకు తెలుసు. నీ భారం అంతా ఆయన మీద వెయ్యి. నీ పని అంతా ఆయనే చూస్తాడు. ఆయనకు శరణాగతి చెందు. నువ్వు ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణించే పాసింజర్‌వు. నువ్వు స్టేషన్‌లు లెక్కపెట్టుకొంటావు ఎందుకు? నువ్వు నిద్రపోయినా పరవాలేదు. నువ్వు దిగవలసిన స్టేషన్ వచ్చినప్పుడు అటెండర్ వచ్చి నిద్రలేపుతాడు. నీ భారం అంతా ఈశ్వరుడి మీద వేసి హాయిగా ఉండు అంతా ఆయనే చూస్తాడు. భారం వెయ్యటం అనేది జీవలక్షణం. సుబ్బరామయ్య గారి భార్య చనిపోయారు. భార్య పోయిన తరువాత ఆయన ఒకసారి భగవాన్ దగ్గరకు వచ్చారు. నా భార్య గురించి బెంగపెట్టుకొన్నాను, భార్య జ్ఞాపకం వచ్చినప్పుడల్లా దుఃఖం వస్తోంది అని భగవాన్‌తో చెప్పారు. సరి సరి అన్నారు భగవాన్. ఆ రాత్రి భార్య కలలోకి వచ్చింది. మరుసటి రోజు భగవాన్ దగ్గరకు వచ్చి రాత్రి నా భార్య కలలో కనిపించిందండి అని మరల దుఃఖపడుతున్నారు. అప్పుడు భగవాన్ అన్నారు ఏమండీ సుబ్బరామయ్యగారు ఈ జీవలక్షణాలను ఎలా భరిస్తున్నారు? నిన్నేమో మీ భార్య కనబడలేదు అని ఏడ్చారు, ఇవాళ ఏమో కనిపించింది అని ఏడుస్తున్నారు. కనిపిస్తే ఏడుపు, కనిపించకపోతే ఏడుపు. ఇవి జీవలక్షణాలు. ఈ జీవలక్షణాలను ఎలా మోస్తున్నారు సుబ్బరామయ్యగారు, ఈ జీవత్వం ఎంత బరువైనది, దీనిని ఎలా మోస్తున్నారు అన్నారు భగవాన్.

ఎవడైతే పరిసరాలను అతిక్రమించలేడో, పరిసరాలను అధిగమించలేడో వాడు మహాత్ముడు కాలేడు, ఋషికాలేడు, వాడు సత్యాన్ని దర్శించలేడు. మనం పరిసరాలకు

బానిసలం అటువంటి మనకా జ్ఞానం వచ్చేది. మీరు ఏమనుకుంటారో అని నేను, నేను ఏమనుకొంటానో అని మీరు అనుకొనే ఈ బాపతు జనానికా జ్ఞానం కలిగేది. ఈ అనుకోవటాలు ఏమిటండి? నలుగురు మెచ్చుకొంటారు అని ఈ పని చేసాను అంటారు, నలుగురు మెచ్చుకోవటం ఏమిటి? ఈశ్వరుడు మెచ్చుకోవాలా? లేక మన చుట్టూ ఉన్న నలుగురు మెచ్చుకోవాలా? ఈ నలుగురు ఎవరు మెచ్చుకోవటానికి? అంటే ఈ నాలుగు అహంకారాలు మెచ్చుకోవాలన్న మాట. రమణస్వామి ఇంటి దగ్గర నుండి పారిపోయి ఏ నాటకాల్లోకో వెళ్ళిపోయాడని కొంతమంది అనుకొనేవారు కాని ఆయనకు భక్తి ఉండి వెళ్ళిపోయాడని, ఆయన సిద్ధుడు అవుతాడు అని ఎవరికీ తెలియదు. ఎందుచేతనంటే ఆయనకు భక్తి ఉన్నా లోపల ఉంచుకున్నాడు కాని ఆయనకు పబ్లిసిటీ అక్కరలేదు. గురుమూర్తంలో కొంతకాలం ఉన్న తరువాత పవళకుండ్రు వెళ్ళారు. పవళకుండ్రులో ఉండగా తల్లి వచ్చింది. తల్లి కొన్ని మిఠాయి పొట్లాలు అవీ తెచ్చి ఎదురుగా పెట్టింది. మనకు తెలుసుకునే బుద్ధి కనుక లేకపోతే మన ప్రక్కగా మహాత్ముడు కూర్చున్నా ఆయన ఎవడో మనకు తెలియదు. మనలో మంచితనం కనుక లేకపోతే మనం ఒక మంచివాడితో స్నేహం చేసినా వాడిలో ఉన్న మంచితనం మనకు తెలియదు. ఈ సృష్టి అంతా కూడా జ్ఞానికి ఒక నీటి బుడగతో సమానము. ఆయన ఎక్కడ ఉన్నాడో, ఆయన ఏ స్థితిలో ఉన్నాడో మనకు తెలియదు. మిఠాయి పొట్లాలు ఆకర్షిస్తాయి అనుకొంది, ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆమెకు తెలియటం లేదు. అప్పుడు ఇంటికి రమ్మని ఏడుస్తుంది. నువ్వు పెళ్ళి చేసుకోవద్దు ఇంటికి వచ్చేయి, నీకు టైముకు అన్నం పెడతాను, నువ్వు జపం చేసుకోవచ్చు అని చెపుతుంది. అక్కడ వినేవాడు లేడు, జపం చేసేవాడు లేడు అని ఆమెకు తెలియదు. నేను ఇన్ని మాట్లాడినా నువ్వు ఏమీ చెప్పటం లేదు. అవును అని చెప్పటం లేదు, కాదనటం లేదు, ఉండమనటం లేదు, పొమ్మనటం లేదు అని తల్లి ఏడుస్తుంది. తల్లి రోదిస్తూ ఉన్నా ఆయన అలాగే మౌనంగానే ఉన్నాడు. అప్పుడు అక్కడ ఉన్నవారు ఒకరు ఏమన్నారు అంటే మీ తల్లిగారు అంతగా బాధ పడుతున్నారు కదా మీకు నోటితో చెప్పటం ఇష్టం లేకపోతే పలక మీద ఏదైనా వ్రాసి ఇవ్వవచ్చు కదా అంటే అప్పుడు రాసి ఇచ్చారు. రమణస్వామి మొట్టమొదటిమాటలు ఇవి, వీటిని జాగ్రత్తగా వినండి. ఇది అర్థమైతే మీకు దుఃఖం ఆరిపోతుంది, ఇంక ఎవరికీ దుఃఖం అనేది రాదు. పరమేశ్వరుడు జీవులను వారి వారి

ప్రారబ్ధమునను సరించి ఆడిస్తున్నాడు. జరుగవలసినది జరిగే తీరును. జరుగరానిది ఎవరు ఎంత ప్రయత్నం చేసినా జరుగనే జరుగదు. ఇది సత్యం. అందుచేత ఊరక ఉండటం ఉత్తమం అని వ్రాసి ఇచ్చారు. మనం ఊరక ఎక్కడ ఉంటాము? అహంకారం ఊరుకొంటుందా? మనస్సులో అస్తమాను ఏవో గొడవలు ఊరుతూనే ఉంటాయి. తరువాత తల్లి అక్కడ నుండి వెళ్ళిపోయింది.

తరువాత రమణస్వామి విరూపాక్ష గుహకు వెళ్ళారు. అక్కడకు అనేక మంది పండితులు వచ్చేవారు. అలాగే గణపతిశాస్త్రిగారు కూడా వచ్చారు. గణపతిశాస్త్రిగారు గొప్ప పండితులు, గొప్ప తపస్సు చేసినటువంటి వ్యక్తి. శాస్త్రిగారు వచ్చేటప్పటికి రమణస్వామి విరూపాక్ష గుహకు బయట ఒకరాయి మీద కూర్చుని సూర్యుడి వంక చూస్తున్నారు. అప్పడు శాస్త్రిగారు భగవాన్‌తో నేను ఎన్నో శాస్త్రాలు చదివాను, ఎన్నో యాత్రలు చేసాను, ఎన్నో మంత్రాలు జపించాను, యజ్ఞాలు, యాగాలు చేసాను, తపస్సులు చేసాను, కానీ ఇప్పటి వరకు తపస్సు అంటే ఏమిటో తెలియలేదు. తపస్సు అంటే ఏమిటో తెలియజేయండి స్వామీ అని అడిగారు. అప్పటివరకు మౌనంగా ఉన్న రమణస్వామి నెమ్మదిగా ఇలా అన్నారు "మనం నేను, నేను అంటున్నాము కదా! ఈ నేను అనే భావన ఎక్కడ పుడుతోందో చూడు. మనస్సు అందులో లీనమవుతుంది. మంత్ర జపం చేసేటప్పుడు మంత్రనాదం ఎక్కడ పుడుతోందో పరికించిన మనస్సు అందులో లీనమవుతుంది, అదే తపస్సు" అని చెప్పారు. మనస్సు ఎక్కడ పుడుతోందో చూస్తే మనస్సు అక్కడ లయిస్తుంది. దాని పుట్టుచోటు మనస్సుకు గ్రహింపు అవ్వాలి అప్పడు మనస్సు అంతర్ముఖమవుతుంది. మనం నేను, నేను అంటున్నాము కదా అది ఒక తలంపు. ఈ నేను అనే తలంపు ఎక్కడ పుట్టివస్తోందో చూడు. నువ్వు లోపలకు చూడటం నేర్చుకో, ఆ నేను గురించి వెదుకు. ఎప్పడైతే నువ్వు ఈ నేనును వెదకటం ప్రారంభించావో ఈ ద్వంద్వాల మధ్యన తిరిగే నేను, రాగద్వేషాల మధ్యన తిరిగే నేను, జనన మరణాల మధ్యన తిరిగే నేను ఒక్కసారిగా పడిపోయి నిజమైననేను అంటే పరబ్రహ్మ స్వరూపం నీకు వ్యక్తమవుతుంది. అదే సత్యవస్తువు. సత్యవస్తువును ఎవడైతే దర్శించాడో వాడే సిద్ధుడు. లోకాన్ని కాదు మీరు వెదకటం, నేను యొక్క మూలాన్ని అన్వేషించండి. మనం చేసేది అంతా లోకవిచారణ కాని ఆత్మవిచారణ చేస్తున్నాము అని అనుకొంటున్నాము. మనం లోకాన్ని వెదుకుచున్నాము, బయట జరిగే ప్రకృతి గొడవలు వెతుకుచున్నాము కాని ఆత్మ కోసం ప్రయత్నం చేయటం లేదు. మనం ప్రకృతి వైపుకు

ప్రయాణం చేస్తున్నాము. అజ్ఞానం వైపుకు ప్రయాణం చేస్తున్నాము. జననమరణ ప్రవాహంలో కొట్టుకొనిపోతున్నాము. ఆ రోజుకారోజు చీకటిలోకాలకు పోతున్నాము.

మీరు ఎన్ని చదువులు చదివినా, మీకు ఎన్ని ఆస్తులు ఉన్నా మీ మనస్సు అనే సమస్యను మీరు పరిష్కారం చేసుకోలేరు, మీ మనస్సును మీరు స్వాధీనం చేసుకోలేరు. ఈ ఒక్కమాట మీరు శ్రద్ధగా వినండి. మీ మనస్సు యొక్క మూలం దానికి తెలిసే వరకు మీ మనస్సు మీకు దుఃఖాన్ని తీసుకొని వస్తూనే ఉంటుంది, మిమ్మల్ని పీడిస్తూనే ఉంటుంది. మనస్సు యొక్క మూలం దానికి అర్థమవ్వాలి. మీ మనస్సు యొక్క మూలం దానికి తెలిస్తే మీ మనస్సు పడిపోతుంది. అప్పడు దుఃఖం మిమ్మల్ని విడిచిపెట్టేస్తుంది. అదే మీ కడసారి జన్మ. ఇంక మీరు శవాలను మోయనక్కరలేదు. మీ మనస్సు యొక్క మూలాన్ని తెలుసుకోవటానికి మహాత్ముల సహవాసం అవసరం. అందుకే మహాత్ములతోటి, యోగులతోటి సహవాసం చెయ్యమన్నారు. ఎవడికైతే మనోమూలం తెలిసిందో వాడికి మనోనాశనం అవుతుంది, మనోనాశనం అయినవాడు యోగి అవుతాడు. ఎవడికైతే ఆత్మానుభవం కలిగిందో, ఎవడి హృదయానికైతే జ్ఞానం యొక్క స్పర్శ తగిలిందో వాడి చూపు చాలు. మన ప్రయత్నం వలన పోగొట్టుకొనేది చాలా తక్కువ, గురువు అనుగ్రహం వలన మనలో ఉన్న బలమైన వాసనలు అన్నీ కాలి బూడిద అవుతాయి. మీకు సంసారంలో అనేక కష్టాలు ఉండవచ్చు. గురువు అనుగ్రహం అనే గంగ మీ హృదయాన్ని తాకినప్పడు ఈశ్వరానుగ్రహం మీమీద ఉన్నప్పడు మీలో ఎన్ని కష్టాలు ఉన్నప్పటికీ, ఎన్ని వాసనలు ఉన్నప్పటికీ అనుగ్రహం అనే గంగా ప్రవాహంలో అవి అన్నీ కొట్టుకొనిపోతాయి.

పళనిస్వామితో భగవాన్ చాలాసార్లు చెప్పారు. నువ్వు భిక్ష చేసి నాకు పెట్టటం ఎందుకు? నేను భిక్ష చేసుకొంటాను నువ్వు వెళ్ళిపో అన్నారు. పళనిస్వామి ఏమన్నారు అంటే నువ్వు వెళ్ళిపో అంటున్నారు. మనిషిని విడిచిపెట్టి నీడ ఉంటుందా? అలాగే నిన్ను విడిచిపెట్టి నేను ఉండగలనా? అన్నారు. పళనిస్వామి విరూపాక్షగుహలో ఉండగానే భగవాన్ స్కందాశ్రమానికి వెళ్ళారు. మాయ అంత తొందరగా మనలను విడిచిపెట్టదు. మనలో ఎంత చిన్న కోరిక ఉన్నప్పటికీ మరణకాలంలో దానిని పెద్దది చేసి చూపిస్తాడు. అంత తపస్సు చేసినవాడికి, అంత యోగాభ్యాసం చేసిన పళనిస్వామికి రేపు మరణిస్తాడు అనగా ఎవరో మామిడిపండు తెచ్చి ఇస్తారు. ఆ మామిడిపండు తింటే ఆయన రోగం పెరుగుతుంది

కానీ మామిడిపండు తినాలి అనుకొంటున్నాడు. ఇతని ధ్యాస అంతా భగవంతుడి మీద లేదు, మామిడి పండు మీదే ఉంది. లోపల అజ్ఞానం ఉన్నంతకాలం ఈ లోకాన్ని చూసి మనం భ్రాంతి పడుతూనే ఉంటాము. మామిడిపండు తినటానికి పళనిస్వామి సిద్ధమయ్యాడు. అంతలోకి రమణస్వామి అక్కడకు వచ్చారు. మామిడిపండును గబగబా లోపలకు వెళ్ళి దాచేసుకొన్నాడు. ఆయనకు తినాలని ఉంది. తీరా చూస్తే గురువు గారికి ఇవ్వాలేమో అని లోపల దాచేసుకొన్నాడు. పులి నోట్లో పడ్డ మాంసపు ముక్కను తీసుకోవచ్చు గాని గురువు అనుగ్రహంలో పడ్డవాడు తప్పించుకొనే అవకాశం లేదు. రమణస్వామి అయిదు నిమిషాలు ప్రశాంతంగా కూర్చుని తరువాత పళనిస్వామితో ఇక్కడ మామిడిపండు వాసన వస్తోందే అన్నారు. మామిడిపండు ఇక్కడ లేదే అన్నారు పళనిస్వామి. అప్పుడైనా నిజం చెప్పేయవచ్చును కదా! స్వామీ మామిడిపండు గూట్లో ఉంది అని చెప్పేయవచ్చు. తీరా మామిడిపండు ఉంది అని అంటే ఇమ్మని అడుగుతాడేమో అనుకొన్నాడు. ఈయన విడిచిపెట్టే స్వామి కాదు కదా! మామిడిపండు ఎక్కడ ఉందో తెలుసుండి కూడా అక్కడ చెయ్యి వెయ్యకుండా మొత్తం గది అంతా వెతకటం ప్రారంభించారు. ఆఖరికి పండు దొరికింది అన్నారు. పళనిస్వామి ఎదురుగా ఆయన చూస్తూ ఉండగానే ఆ మామిడిపండులో ఉన్న రసం అంతా తాగేసి, టెంక అంతా శుభ్రంగా నాకేసి బయటపడేసారు. కారణం ఏమిటి అంటే నువ్వు మామిడిపండు తినవద్దు అని భగవాన్ చెప్పినా ఆయన తినేస్తాడు. ఆయనకు ఉన్న జబ్బుకు మామిడిపండు తినకూడదు. అందుచేత గురువు అనేవాడు మనకు ఏది మంచిదో అదే చేస్తాడు కాని మన మెప్పులకోసం ఏమీ చేయడు. వాడు గురువు.

మీ చేతితో నాలుగు అక్షరాలు రాసి ఇవ్వండి అని ఒక భక్తుడు భగవాన్‌ని అడిగితే తరతరాలకు ఉపయోగపడే సందేశం ఇస్తున్నారు. ఏకమక్షరం హృది నిరంతరం భాసతే స్వయం లిఖ్యతేకథం. అర్థం చేసుకొనే హృదయాలు ఉంటే, తపన పడే మనస్సులు ఉంటే ఆ సందేశం చూడండి. శాశ్వతమైన సందేశం, సందేహాల్ని పోగొట్టే సందేశం దేనికైతే క్షరం లేదో, దేనికైతే నాశనం లేదో, ఏదైతే ఆత్మ స్వరూపమో, ఏదైతే సత్య స్వరూపమో ఏకమక్షరం అది ఒక్కటే హృది నిరంతరం అంటే నిరంతరం ఒక్క సెకను కూడా విడిచిపెట్టకుండా ఎల్లప్పుడూ నీ హృదయంలో నేను, నేను అని ప్రకాశిస్తోంది. దానికి ఆకాశంలో ఉన్న సూర్యుడు అక్కరలేదు, మన చేతిలో ఉండే దీపాలు అక్కరలేదు, తనంతట తానుగా స్వయంగా వెలుగుతోంది. అటువంటి ఆత్మ గురించి, సత్యం గురించి మాటలతోటి ఎలా వ్రాయగలను?

ఏదో కాలక్షేపానికి అడిగినట్లుగా ఒక భక్తుడు అడిగితే జాతికంతా చిరకాలం, కలకాలం ఉండే సందేశం రాసి ఇచ్చారు. దీనిని కనుక మనం మననం చేస్తే మన మనస్సులో ఉన్న కల్మషం, కుట్ర అంతా కూడా బయటకు పోతుంది.

భగవాన్ స్కందాశ్రమంలో కొంతకాలం ఉన్నారు. 1922వ సంవత్సరంలో స్కందాశ్రమం నుండి కిందకు వచ్చారు, అప్పుడు రమణాశ్రమం ఏర్పడింది. 1950వ సంవత్సరం ఏప్రియల్ 14వ తేదీన రాత్రి 8 గంటల 47 నిమిషాలకు ఆయన శరీరం విడిచి పెట్టారు. ఆయన శరీరాన్ని విడిచిపెట్టినప్పుడు ఒక కాంతి పుంజం వెలువడి ఆకాశంలో ప్రయాణించి అరుణాచల శిఖరంలో అంటే అరుణగిరిలో ఐక్యమయ్యింది. అరుణాచలేశ్వరుడే అంటే ఆ గిరే రమణరూపంలో వచ్చింది. నువ్వు ఎవరివో నువ్వు తెలుసుకో. నువ్వు ఎవరో నీకు తెలిస్తే నీ స్వరూపం ఏమిటో నీకు తెలుస్తుంది. మనం ఎవరిమో మనం తెలుసుకోవటానికే ఈ లోకం లోనికి వచ్చాము. మనం ఈ లోకంలోనికి వచ్చిన మొదటి పని, చివరి పని ఇదే. కానీ మనం వచ్చిన పని మర్చిపోయాము. ఇదే మాయ.

చివరగా నేను చెప్పేది ఏమిటి అంటే ఏ లోకం గొడవలు అయితే మనం నిరంతరం స్మరించుకొంటున్నామో ఆ విషయాలను విడిచిపెడితేనే గాని మనం ఆత్మను స్మరించలేము. మనస్సు ఒకే పని చేస్తుంది. అయితే ఆత్మని అయినా చింతిస్తుంది లేకపోతే లోకంలో విషయాలనైనా చింతిస్తుంది. ఇప్పుడు లోకంలోని విషయాలనే మన మనస్సు చింతిస్తోంది. లోకంలోని విషయాలను చింతించటం మానమంటే దానికి భయం వేస్తోంది. భయం పోవాలంటే మనకు ధైర్యం కావాలి. అటువంటి ధైర్యాన్ని అందరికీ ప్రసాదించమని రమణ దేవుడిని ప్రార్థిస్తున్నాను. భగవంతుడిని తెలుసుకోవటానికి మన ఇంట్లో ఉన్న మనుషులు మనకు సహాయం చెయ్యరు, మీ హృదయంలో ఉన్న శ్రద్ధే మీకు సహాయం చేస్తుంది. అందుచేత శ్రద్ధను మీరు సంపాదించుకోండి. ఎవరు వద్దన్నా, మీకు ఇంటి దగ్గర ఎన్ని పనులు ఉన్నా మీ శ్రద్ధే మిమ్మల్ని ఇక్కడకు తీసుకొని వచ్చింది. జ్ఞానులుగా, యోగులుగా, ఋషులుగా మిమ్మల్నందరిని పరమేశ్వరుడు తీర్చిదిద్దాలని, దుఃఖం యొక్క స్పర్శ లేని స్థితికి, దుఃఖం అనేది ఎలా ఉంటుందో తెలియని స్థితికి మిమ్మల్నందరిని తీసుకువెళ్ళమని మీ అందరి హృదయాలలో సాక్షిగా ప్రకాశిస్తున్న పరమేశ్వరుడికి చేతులు జోడించి, నా శిరస్సు వంచి హృదయపూర్వక నమస్సులు సమర్పించుకొంటున్నాను.

## శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805

| | | |
|---|---|---|
| ఫిబ్రవరి | 18 | రామకృష్ణ జయంతి మ॥ గం॥ 1-00లకు అమలాపురం మాష్టారు ప్రవచనం |
| మార్చి | 4 | మహాశివరాత్రి సందర్భంగా ఉదయం గం॥ 6-00లకు పారాయణ<br>గం॥ 7-00ల నుండి ప్రసాద వినియోగం, గం॥ 8-00లకు పుజా కార్యక్రమం<br>గం॥ 9-00ల నుండి భక్తుల ప్రవచనములు, గం॥ 11-00ల నుండి అన్న ప్రసాదం<br>మధ్యాహ్నం గం॥ 1-00లకు హైదరాబాద్ అరుణగారి ప్రవచనం<br>రాత్రి జాగరణ కార్యక్రమము. |

**SRI RAMANA KSHETRAM A/c. No. 510101006497273**
**Corporation Bank, Palakol Branch, IFSC Code : CORP0001613**

**ఆంధ్ర ఆశ్రమము, తిరువణ్ణామలై ఫోన్ : 04175-236174**
**For Accomodation : Office Incharge Balaraju 08297672348, 9849124502**

## చిత్తశుద్ధి

"చిత్తశోధకం ముక్తి సాధకం" అన్నారు భగవాన్ శ్రీరమణమహర్షి. 'చిత్తశుద్ధి' అనే ద్వారం గుండానే, మోక్షంలోకి ప్రవేశించాలి అన్నారు సద్గురువు శ్రీనాన్నగారు. మానవుల దుఃఖానికి కారణం అహంకార, మమకారములు మరియు కర్తృత్వబుద్ధి. కర్తృత్వబుద్ధి కారణమైతే, దుఃఖము కార్యము. కాబట్టి కర్తృత్వబుద్ధి నశించకుండా, దుఃఖము నశించదు. అట్టి కర్తృత్వబుద్ధి, దేహము-నేను అను బుద్ధినుండి ఉదయిస్తుంది. చిత్తశుద్ధి లేకుండా కర్తృత్వబుద్ధి నశించదు. సాధకుడు ఏవిధమైన సాధన చేసినా, దాని ద్వారా చిత్తశుద్ధిని సంపాదించాలి. పూజ, జపము, ధ్యానము, నిష్కామ కర్మ, సేవ మున్నగునవి చిత్తశుద్ధిని సంపాదించుటకు సహకరిస్తాయి. గుర్తింపుల కోసం మరియు స్వార్థముతో కర్మలను ఆచరిస్తే, మలిన చిత్తము నుండి అట్లే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందలేము. అహంభావన లేకుండా, ఈశ్వరార్పణ బుద్ధితో, కర్మలను ఆచరించే వారికి, మనస్సు అంతర్ముఖమై, కాలక్రమంలో స్వరూప-అమృతస్థితి అనుభవమవుతుంది. చిత్తశుద్ధి కలిగిన వారికి మాత్రమే అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగిన వారికి అమృతానుభవం కలుగుతుంది. అమృతానుభవం పొందిన వారికి ఉన్నది ఉన్నట్లుగాను, లేనిది లేనట్లుగాను, అనుభవమవుతుంది. అప్పుడు పరమశాంతి, స్వరూపంగా వ్యక్తం అవుతుంది. ద్వైతబుద్ధిని కల్పించేది మనస్సే! అట్టి మనస్సును అంతర్ముఖం చేసి, సమబుద్ధిని అనగా ఆత్మబుద్ధిని అలవరచుకొని, భేదబుద్ధి నుండి విడుదల పొందాలి. చిత్తశుద్ధి లేకుండా, భేదబుద్ధి నశించదు. కర్మఫలాలను ఆశించకుండా, కర్మలను ఈశ్వరార్పణబుద్ధితో చేసేవారికి, తోటి జీవకోటిని ద్వేషించని వారికి, చిత్తశుద్ధి కలిగి, తద్వారా దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందుతారు. దేహము జీవించి యుండగానే, దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందుటయే మన గమ్యం! అదే మోక్షం! అదే నేను! అందుకు 'గురుకృప' నిరంతరం ఉండనే ఉంది.

**ఓం తత్ సత్**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# స్వేచ్ఛామయ జీవితానికి పరమ లక్ష్యం - గురువును అనుసరించాలి

పూర్ణ గురువులు దయామయులు, కృపా సముద్రులు ఎవరియందు వారికి ద్వేషం ఉండదు, పొగడ్త, నిరసనా వారికి రెండూ ఒక్కటే. వారు దాతలే కానీ యాచకులు కారు, శిష్యుని సంపదలో వారికి ఏ జోక్యమూ ఉండదు. వారి బోధలకు ఏ రూపంలోనూ ప్రతిఫలం తీసుకోరు. అపకారిని కూడా క్షమిస్తారు. ఎవరి గురించీ చెడ్డగా మాట్లాడరు. అందరి యందు ప్రేమ కలిగి ఉంటారు. "నీ శత్రువును ప్రేమించు" అనే సిద్ధాంతం వారిలో మూర్తీభవించి ఉంటుంది. వారు ప్రత్యేక దుస్తులు ధరించరు. వారి బోధలు సులువుగా, స్వాభావికంగా ఉంటుంది. వారు దివ్యశక్తులను ప్రదర్శింపక వాటిని నిగూఢంగా ఉంచుతారు. వారి నుండి నిరంతరం దివ్య తరంగాలు వెలువడుతూ ఉంటాయి. ఆ తరంగాల ఫలితం అమోఘం, వారిలో గొప్ప ఆకర్షణ శక్తి ఉంటుంది. వారి సమక్షంలో ఉన్నప్పుడు మనశ్శాంతి ఆనందాలు లభిస్తాయి. వారి ముఖం దివ్య ప్రకాశంతో వెలుగుతుంది. వారి స్వరం ఇంపుగా ఆకర్షణీయంగా ఉంటుంది వారి చూపుల్లో దివ్య ప్రేమ ప్రవహించి మన హృదయంలో చొరబడుతుంది. వారి ప్రవచనాలు ఒక పక్వత కలిగి ఉంటాయి. వారి బోధలు అన్ని సందేహాలను తీరుస్తాయి. కొంగ పిల్లలను వదలి ఎంతదూరం వెళ్ళినా ధ్యాస పిల్లల మీదనే ఉంటుంది. తాబేలు గుడ్లు పెట్టి సముద్రంలోకి వెళ్ళినా గుడ్లమీదే ధ్యాసతో ఆహారాన్ని అందిస్తుంది. అది దైవీ ప్రణాళిక. అలాగే గురువు ధ్యాస ఎప్పుడూ శిష్యుని మీదనే ఉంటుంది. శ్రీనాన్నగారు "నా వద్దకు ప్రకృతి పరమైన రాజకీయపరమైన వ్యక్తులు ఎందరో వస్తారు. గుమ్మం దాటే వరకే వారిపై దృష్టి మిగిలిన కాలమంతా శిష్యులమీదనే ఉంటుంది" అన్నారు. శిష్యుడు దూరంగా ఉన్నా దగ్గరా ఉన్నా రక్షణ ఇచ్చేందుకు సద్గురువు అభయ హస్తాలు తయారుగా ఉంటాయి. శిష్యునితో సద్గురువు సంబంధం నిర్మల ప్రేమ పూరితంగా ఉంటాయి. సత్యాన్వేషకుణ్ణి నిజ గమ్యానికి స్వయంగా అంతర్ మార్గంలో నడిపించి వెంట తీసుకొని వెళతారు. ఇవి అన్నీ ఆంతరంగిక శిష్యులకు అనుభవైకవేద్యాలే. మరణానంతరం మనతో వచ్చేది గురువే, యమభటులు తీసుకొని పోరు. మార్కండేయుని జీవితమే ఉదాహరణ. అలాంటి సద్గురువు దొరికినప్పుడు వారి ఇష్టానికి, ఆదేశానికి హృదయపూర్వకంగా శిరసావహించటమే మన కర్తవ్యం. వారు ముక్తికి దాతలు. ఆత్మ వికాశం లోపలి ప్రయాణానికి, వారి మార్గదర్శకత్వంలోనే సాధ్యమవుతుంది. వారి రూప ధ్యానం వారి కళ్యాణ గుణాల మననం మనలో ఉన్న అన్ని మలినాలను కడిగి శుభ్రం చేస్తుంది. అవి అజ్ఞానపు పొరలను తొలగిస్తాయి. కష్టసుఖాలను కావడికుండలా చూచే శక్తి గురువు వల్ల అలవడుతుంది. గురువు పరిశరాల్లో శాంతి, సచ్చిదానందాలు పరిమళిస్తూ ఉంటాయి. జనన మరణ చక్రం నుంచి శాశ్వతంగా విముక్తి లభిస్తుంది. వేమన "కోరి మదిని గురుని కొలువు చేయుట మేలు, గారమున(దెలుపుగహన విద్య, దూరదృష్టి నిలిపి తోడరుట మోక్షంబు" అన్నారు. సిద్ధాంతం ఆచరణ రూపం దాల్చాలంటే గురువు యొక్క అనుగ్రహం ఎంతైనా అవసరం. మరో మార్గం లేనే లేదు - లేదు - లేదు.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966